

మహిళా సంఘాలకు ఇన్సూరెన్స్ పాలసీ రెన్యువల్ చేయండి

బోథ్, మే 26 (ఆంధ్రజ్యోతి): వివిధ మహిళా సంఘాలున్న మహిళలకు పీఎమ్‌జేజేబీవైపీఎం ఎస్‌బీవై ఇన్సూరెన్స్ పథకాల రెన్యువల్ కోసం సీసీలు, వీవోఏలు తగుచర్యలు తీసుకోవాలని ఏపీఎం మాధవ్ తెలిపారు. పీఎంజేజేబీవై రెన్యువల్ కోసం 436 రూపాయలు పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్ 20 రూపాయలు అవసరమవుతాయని ఏటీఎం వివరించారు. మహిళలు తమ వ్యక్తిగత అకౌంట్‌లో వెయ్యి రూపాయల వరకు ఉంచుకోవాలని, దీంతో పాలసీ రెన్యువల్‌కు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రతి మహిళా గ్రూపు సభ్యులకు చేరవేయాలని అన్నారు. ఈనెల చివరి వరకు రెన్యువల్ చేయాలని కోరారు.



ఇచ్చోడలో అధికారులు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

జిల్లాలో నకిలీ విత్తన బెడద!

- వానాకాలం సీజన్ మొదలు కావడంతో రెచ్చిపోతున్న దళారులు
- అధిక దిగుబడులు వస్తాయని వ్యాపారుల మాయమాటలు
- నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు ప్రయత్నం
- వెలుగులోకి నకిలీ విత్తన దందా.. పలువురు వ్యాపారులపై కేసులు
- దళారుల దందాకు అధికారుల పరోక్ష సహకారం
- కురుస్తున్న వర్షాలకు పత్తి, సోయా సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- పంట పెట్టుబడి సాయం కోసం వ్యాపారుల వద్దకు పరుగులు
- చేతిలో చిల్లిగవ్వ లేక ఉద్దెరపై ఎరువులు, విత్తనాల కొనుగోళ్లు
- ఉద్దెర పేరిట 25 శాతం అధిక వడ్డీ వసూలు చేస్తున్న వ్యాపారులు

ఆదిలాబాద్, మే26 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు ఏటా నకిలీ విత్తనాల బెడద తప్పడం లేదు. గతంలో మాదిరిగానే ఈ యేడు కూడా జిల్లాలో నకిలీ విత్తన దందా జోరుగా సాగుతోంది. ఇటీవల ఇచ్చోడ, బేల మండలాల్లో నకిలీ విత్తన దందా వెలుగు చూడడం ఆందోళన రేపుతోంది. ఈ సారి కూడా రైతులకు నకిలీ విత్తనాల బెడద తప్పేలా లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. నాలుగైదు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పత్తి, సోయా విత్తనాలను విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. అయితే రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొంత మంది వ్యాపారులు నకిలీ విత్తనాల దందాకు తెరలేపుతున్నారు. ఎన్నిరకాలుగా కట్టడి చర్యలు చేపట్టిన వ్యాపారులు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. వానాకాల సీజన్ మొదలు కావడంతో రైతులు పెట్టుబడుల కోసం వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక పోవడంతో ఉద్దెరపై ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రతియేటా జిల్లాలో దళారీ దందా సాగుతున్నా అధికార యంత్రాంగం అడ్డుకట్ట వేయలేకపోతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల్లో దళారులు మకాంవేసి జోరుగా వడ్డీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో ఇష్టారాజ్యంగా ఎరువులు, విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలోనే నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకున్న వ్యాపారులు వానాకాల సీజన్ మొదలు కావడంతో అమ్మేసుకుంటూ అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఇంద్రవెల్లి, ఉట్నూర్, ఇచ్చోడ, బేల, జైనథ్, తలమడుగు, బోథ్ మండలాల్లో నకిలీ పత్తి విత్తన విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అధికారుల దాడుల్లో నకిలీ విత్తన దందా బయట పడుతుంది. గ్రామాల్లో తమ ప్రతినిధులను నియమించుకుని గుట్టు చప్పుడు కాకుండా రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా 300లకు పైగా ఎరువులు, విత్తన దుకాణాలు ఉన్నాయి. అనాధికారికంగా మాత్రం గ్రామాల్లో వందలాది మంది దళారులు ఎరువులు, విత్తనాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చాలాచోట్ల బయోమెట్రిక్ విధానం అమలుకావడం లేదని తెలుస్తోంది. దీంతో బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్మేసుకుంటున్నారు. కొంతమంది అధికారులే దళారీ దందాకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలోకి చేరిన నకిలీ విత్తనాలను అమాయక రైతులకు అంటగట్టడంతో ఈ సారి కూడా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందంటున్నారు.

వ్యాపారులు చెప్పిందే లెక్కా..

చాలా గ్రామాల్లో స్థానిక వ్యాపారులు చెప్పిందే లెక్కాగా మారుతోంది. రైతుల వద్ద పెట్టుబడి లేక పోవడంతో వ్యాపారులు ఇచ్చిన విత్తనాలనే తీసుకుంటు సాగు చేస్తున్నారు. అలాగే ఉద్దెరపై ఎరువులు, విత్తనాలను అందిస్తున్న దళారులు పంట చేతికి రాగానే దానికి రెండింతలుగా దండుకుంటున్నారు. ఉద్దెర పేరుతో 25 శాతం అధిక వడ్డీని వసూలు చేస్తున్నారు. జిల్లాలో వందలాది మంది దళారులు వానాకాల సీజన్‌లో రైతుల కు అధిక వడ్డీలకు రుణాలు ఇస్తున్నట్లు తెలిసింది. ఇందులో పలువురు వ్యాపారులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతియేడు గుట్టు చప్పుడు కాకుండా కోట్ల రూపాయల అక్రమ దందా కొనసాగుతోంది. నగదుకు ఒక రేటు, ఉద్దెరకు మరో రేటును నిర్ణయిస్తున్నారు. పంట చేతికి రాగానే అసలుతో పాటు అధిక వడ్డీని వసూలు చేస్తున్నారు. గత్యంతరం లేక రైతులు ఉద్దెరపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేస్తున్నారు. ఉద్దెరపై కొనుగోలు చేయడంతో వ్యాపారులను రైతులు ప్రశ్నించలేక పోతున్నారు. ఏ కారణం చేతనైనా సకాలంలో అప్పు చెల్లించకుంటే తమ ప్రతినిధులతో బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. ఫర్టిలైజర్ దుకాణాల యజమానుల ఆగడాలకు అధికారులు సైతం వత్తాసు పలకడంతో అక్రమదందాకు అడ్డు అదుపు లేకుండా పోతుందన్న విమర్శలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీలకే ఎరువులు, విత్తనాలను విక్రయించాల్సి ఉంది. కానీ వ్యా పారులు అవేమి పట్టించుకోవడం లేదంటున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు నిలువుదోపిడికి ఎగబడుతున్నారు. వానాకాల సీజన్ మొదలైనప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతులను దళారులు, వ్యాపారులు నిండుగా ముంచుతున్నారు.

తప్పించుకుంటున్న అసలు సూత్రధారులు..

నకిలీ పత్తి విత్తనాల దందాలో అసలు సూత్రధారులు తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడుతున్న వారంతా మధ్య దళారులేనని తెలుస్తోంది. కొంతమంది బడా వ్యాపారులు తమకున్న సంబంధాలతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుంటు దళారులకు కమీషన్‌పై అమ్మేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ బడా వ్యాపారికి జిల్లా వ్యాప్తంగా నకిలీపత్తి విత్తనాల దందాతో సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఇచ్చోడ, బేల మండలాల్లో పట్టుబడిన విత్తనాలు ఆ వ్యాపారి ద్వా రానే సరఫరా అయినట్లు తెలుస్తోంది. నకిలీ విత్తన దందాపై మరింత లోతుగా దర్యాప్తు జరిపితే అసలు సూత్రధారుల బాగోతం బయట పడనుంది. గతంలో నకిలీ విత్తనాలను విక్రయిస్తూ పట్టుబడిన వ్యాపారులు మళ్లీ అదే దందాలో కొనసాగుతున్నారు. దీంతో రైతులకు నకిలీ విత్తన ముప్పు తప్పడం లేదు. నకిలీ విత్తన వ్యాపారంలో పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేస్తూ వదిలేస్తున్నారే తప్ప. అసలు సూత్రధారులెవరో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదంటున్నారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేని దళారులకు కమీషన్‌పై ఎరువులు, విత్తనాలను సరఫరా చేస్తూ అమ్మేసుకుంటున్నారు. కొంత మంది దళారుల ఇళ్లలో ఎరువులు, విత్తన నిల్వలు భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎలాంటి రసీదులు ఇవ్వకుండానే విక్రయిస్తున్నట్లు సమాచారం ఏదైనా తేడా వస్తే తమకేమి సంబంధం లేదనట్లుగా వ్యాపారులు తెలివిగా వ్యవహరిస్తున్నారు. నామమాత్రంగా చర్యలు తీసుకోవడంతో నకిలీ విత్తనదందాకు అడ్డుకట్ట పడడం లేదు. అధికారులకు ముందుకు చూపులేక పోవడమే ఇలాంటి పరిస్థితికి అసలు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. రైతుల ఇండ్లలోకి నకిలీ విత్తనాలు వెళ్లిన తర్వాత ఎన్నిదాడులు చేసిన ప్రయోజనం ఉండదం టున్నారు. రైతుల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం వ్యవసాయ శాఖ అధికారులపై ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు తీసుకుంటాం..

:శివకుమార్ (ఏడీఏ, ఆదిలాబాద్)

జిల్లాలో నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి నిఘా సారించాం. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలి. తప్పనిసరిగా రసీదును తీసుకుని భద్రపరుచుకోవాలి. విత్తనాలపై ఏవైనా అనుమానాలు వస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

గుట్టుచప్పుడు కాకుండా రైతులకు అమ్మకాలు..

ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకున్న వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. వ్యాపారులు ముందుచూపుతోనే రెండు మూడు నెలల క్రితమే భారీగా నకిలీ విత్తనాలను నిలువ చేసుకున్నారు. ఎవరికి అనుమానం రాకుండా గ్రామాల్లో తమ బంధువుల ఇళ్లలో డంపు చేసిన విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అధిక దిగుబడులు వస్తాయని నమ్మబలుకుతూ అన్నదాతలను ఆశపెడుతున్నారు. లూజు విత్తనాల విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ విచ్చల విడిగా విక్రయాలు జరుపుతున్నారు. బీటీ -3 పేరిట లూజు విత్తనాలను అమ్మేసుకుంటున్నారు. లూజు విత్తనాల పై రైతులు ఆసక్తి చూపడంతో వ్యాపారులకు కలిసి వస్తుంది. దీంతో ఫిర్యాదు చేసే వారే కరువవుతున్నారు. ఏదైనా ఫిర్యాదు వస్తేనే అధికారులు హడావిడి చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో నకిలీ విత్తనాలపై నిఘా సారించడం లేదంటున్నారు. రైతుల్లో అవగాహన కల్పించక పోవడంతో వ్యాపారులు చెప్పిందే విత్తనంగా మారుతోంది. గతంలో నకిలీ విత్తనాల బెడదతో వేల ఎకరాలలో పంట నష్టం జరిగింది. ముఖ్యంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి పత్తి, సోయా విత్తనాలను దిగుమతి చేస్తూ రైతులకు అంటగడుతున్నారు.



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించండి

● కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి



వినతిపత్రం అందిస్తున్న వడగామ్ గ్రామస్తులు

ఇంద్రవెల్లి , మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడగామ్ గ్రామం మీదుగా ఉన్న రింగ్ రోడ్డు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారిందని, వెంటనే మంజూరైన నిధులతో రోడ్డు పనులను ప్రారంభించే విధంగా కృషిచేయాలని వడగామ్ గ్రామస్తుడు ఆత్రం మహేశ్వర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందించారు. ఇంద్రవెల్లి నుంచి వడగామ్ గ్రామం మీదుగా ఉన్న రింగ్ రోడ్‌కు అనుబంధంగా సుమారు 18 గ్రామాలున్నాయని తెలిపారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అదే విధంగా గుంతలమయంగా మారిన రోడ్డులో 108 అంబులెన్స్ సమయానికి రాక అత్యవసర సమయంలో ఆసుపత్రికి చేరలేకపోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వడగామ్ గ్రామస్తులు ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఏఐసీసీ విచార్‌విభాగ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్

బోథ్, మే 26 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన సోనాల మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలని కలెక్టర్ రాజార్షిషాను ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అరుణ్‌కుమార్ సోమవారం కలిసి కోరారు. అంతేగాక మండలానికి 60 ఇందిరమ్మ ఇల్లు అదనంగా కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రజల సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని కలెక్టర్‌కు విన్నవించడం జరిగింది.

విత్తన కొనుగోలులో మెలకువలు పాటించాలి

తాంసి, మే 26 (ఆంధ్రజ్యోతి): విత్తన కొనుగోలు సమయంలో రైతులు మెలకువలు పాటించాలని తాంసి మండల వ్యవసాయ అధికారి రవీందర్ సూచించారు. సోమవారం మండలంలోని కప్పర్ల గ్రామంలో విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లాట్ నెంబర్, రసీదు ఉంటే నే కొనుగోలు చేయాలని అన్నారు. గ్రామాలలో నకిలీ విత్తనాలు అమ్మినట్లు కనిపిస్తే వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మండల టాస్క్ ఫోర్సు టీమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

ప్రజావాణికి అర్జీల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారులు పోటెత్తారు. ప్రతిసోమవారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదులలో వివిధ మండలాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి దరఖాస్తులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్‌లు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కరించాలని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు.

ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం ఆపాలి..

ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యం ఆపివేయాలని ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేనంబర్ 73లో 40 సంవత్సరాలుగా భూమి సాగుచేస్తు న్నామన్నారు. కానీ ఇటీవలే ఈ భూమిలో ఫారెస్ట్ అధికారులు సర్వే చేయించి.. చెట్లు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారని వాపో యారు. అదేవిధంగా ఈ సాగు భూమిలోకి ఎవరిని రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి..

విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని జైనథ్ మండలం సాంగ్వీ(కే) గ్రామస్తులు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. తమ గ్రామంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ భూముల్లో స్తంభాలు విరిగిపోయి, తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని వీటి వల్ల పలువురు ప్రమా దానికి గురయ్యారని వాపోయారు. అదే విధంగా ప్రమాదానికి గురైన బాధిత కు టుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరా రు.

ఉద్యమకారులకు ప్రాధాన్యమివ్వాలి..

సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని మలిదశ ఉద్యమకారుడు చాకటి కిరణ్ కోరారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని సోమవారం కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పేర్కొన్నారు.

భవనాన్ని కేటాయించాలని వినతి..

హిందీ సాహితీ సేవ కోసం భవనాన్ని కేటాయించాలని హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. భవనం లేక హిందీ భాష కార్యక్రమాలు నిర్వహించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. దత్తాత్రేయ, చంద్రశేఖర్ అంబేకర్, సాంబన్న, జావేద్ అలీ ఉన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి

ఉట్నూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కా రానికి ఐటీడీఏ ద్వారా కృషిచేస్తున్నామని ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తమ భూముల్లో మొక్కలు నాటనీయకుండా చర్యలు తీసుకొని తాము ఐదు నాలుగు సాగుచేస్తున్న భూములను కాపాడాలని, అటవీశాఖ అధికారుల వేధింపుల నుంచి రక్షించాలంటూ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలం కోలాంగూడకు చెందిన గిరిజనులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను వేడుకున్నారు. పోడుభూములు సాగుచేస్తున్న పట్టాలు వస్తాయంటూ మభ్యపెట్టి అటవీ హక్కుపట్టాలు ఇవ్వకుండానే మీ వద్ద పట్టాలు లేవు. ఈ భూములు ఖాళీ చేయాలి, ట్రంచులు తవ్వి మొక్కలు పెడతామని తిర్యాని మండల అటవీశాఖ అధికారులు బలవంతంగా తమ సంతకాలు తీసుకుని వెళ్లారని కోలం గిరిజనులు భీమ్రావు, ముత్తయ్య, చిన్ను, భగవంతురావు, దశమంతరావు, మడావి రాము తదితరులు పీఒకు వివరించారు. ఉట్నూర్ మండలం శాంపూర్ గ్రామానికి చెందిన గిత్తే మనోహర్ తమ గ్రామానికి బోర్వెల్ సౌకర్యం కోసం, తలమడుగు మండలం రేకులగూడ గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ గ్రామానికి రోడ్లు, ఇండ్ల సౌకర్యం కల్పించామని, ఆదిలాబాద్ మండలం అంకోలి గ్రామానికి చెందిన రాజకుమార్ తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించామని, కడెం మండలం ఉడుంపూర్ గ్రామానికి చెందిన ఆత్రం మాణిక్‌రావు విద్యుత్ కనెక్షన్ ఇప్పించామని కోరారు. పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ వసంత్‌రావు, ఏపీఓ (పీవీటీజీ) మేస్రం మనోహర్, ఏవో దామోదర స్వామి మనోహర్, మేనేజర్ శ్యామల డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌డీ పీడీని సస్పెండ్ చేయాలి

● ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జుపటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, మే26 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్ ఎఫ్‌డీపీడీ (ఫారెస్టు డెవలప్ మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్) శాంతారాంను సస్పెండ్ చేయాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జుపటేల్ డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ చట్టాల పేరుతో ఆదివాసీ గిరిజనులు, గిరిజనేతరులు నాలుగు దశాబ్దాల ముందు నుంచి సాగుచేస్తున్న వ్యవసాయ పోడు భూముల నుంచి అమాయకులను బెదిరించి సంతకాలు తీసుకుంటు గుంతలు తవ్వి మొక్కలు పెంచుతామంటూ అటవీశాఖ అధికారులు దౌర్జన్యాలకు పూనుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్‌లో మంత్రులు, కార్యదర్శులు, పీసీఎఫ్‌తో జరిగిన సమావేశంలో కూడా అటవీ శాఖ అధికారుల వేధింపుల గురించి వివరించామన్నారు. దశాబ్దాకాలం పాటు టీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఎలాంటి ఇబ్బందులు గిరిజనులు, గిరిజనేతరులకు కలిగించని అటవీ శాఖ అధికారులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి ఇలాంటి కార్యక్రమాలకు పూనుకుంటున్నారని ఎఫ్‌డీపీడీతో పాటు ఉట్నూర్ ఎఫ్డీఓ రేవంత్‌చంద్రలు ఆరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు చంద్రయ్య, జగదీశ్ జాదవ్, తిరుపతి, ఖయ్యుం, ఇక్బాల్, శ్రీకాంత్, నిసార్, అజముద్దీన్‌లు పాల్గొన్నారు.

కులవృత్తులను కాపాడడానికి రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినందున ఆదిలాబాద్ జిల్లాలోని నాయిబ్రాహ్మణుల కులవృత్తిని రక్షించడానికి ప్రభుత్వం ద్వారా జీవో వచ్చేలా ఖానాపూర్ ఎమ్మెల్యే కృషి చేయాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమ వారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ను కోరారు. అలాగే సోమవారం ఉట్నూర్ మండలంలోని దంతనపల్లి చెరువు, బీర్సాయిపేట పెద్ద చెరువుల మరమ్మతుల కోసం రూ.43 లక్షలు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. దంతనపల్లి చెరువు మరమ్మతుల కోసం రూ.25 లక్షలు, బీర్సా యిపేట్ చెరువు మరమ్మతుల కోసం రూ. 18 లక్షలు మంజూరు చేయించామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం పోలీస్ ముఖ్యకార్యాలయంలో ఎస్పీ ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి వివరించారు. సమస్యలను విన్న జిల్లా ఎస్పీ త్వరితగతిన పూర్తిచేసి పరిష్కరించాలని ఫోన్ ద్వారా సిబ్బందికి ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతిఒక ఫిర్యాదును ఖచ్చితంగా పరిష్కరించే దిశగా పోలీసులు కృషిచేయాలని ఎస్పీ సూచించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 40 వివిధ కారణాలతో ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో యువకుడి మృతి

ఉట్నూర్, మే26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులమడుగు అటవీ ప్రాంతంలో గిరిజన యువకుడి పై అడవిపంది దాడి చేసిన ఘటనలో గిరిజన యువకుడు మృతి చెందాడు. రాజులమడుగుకు చెందిన కొడపా లక్ష్మణ్(35) భార్య లక్ష్మీబాయితో కలిసి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఆదివారం ఉట్నూర్ వారసంతకు వచ్చిన దంపతులు సాయంత్రం తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలోని అటవీ ప్రాంతంలో లక్ష్మణ్ బహిర్భూమి కోసం పొదలమాటున వెళ్లడంతో పొదల్లో నుంచి వచ్చిన అడవిపంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కేకలు వేయడంతో భార్య లక్ష్మీ బాయి అక్కడికి వెళ్లి చూడగా భర్త మృతిచెందినట్లు గుర్తించింది. స్థానికుల సమాచారం మేరకు ఫారెస్టు బీట్ ఆఫీసర్ రామ్‌కుమార్ అక్కడికి వెళ్లి మృతుని సమా చారం సేకరించారు. లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారని స్థానికులు తెలిపారు. అడవిపంది దాడిలో కొడప లక్ష్మణ్ మృతిచెందడం బాధాకరమని, ఫారెస్టు అధికారులు మృగాలపై చూపిస్తున్న ప్రేమను మనుషులపై చూపాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రికి వచ్చారు. తక్షణమే పోస్టుమార్టం నిర్వహించాలని డాక్టర్లను ఆదేశించారు.



మృతుడి భార్య, పిల్లలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

‘ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి’

ఉట్నూర్, మే26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడినందున వెంటనే గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపతి లింగాగౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షా కాలం దృష్టిలో పెట్టుకొని గ్రామల్లో ఆరోగ్యపరంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు గ్రామానికి సర్పంచ్, పాలకవర్గాల సభ్యులు అవసరం ఎంతో ఉందన్నారు. గత 18 నెలలుగా సర్పంచ్‌లు లేక పోవడం వల్ల నిధులు లేక గ్రామాలు అభివృద్ధికినోచుకోలేక ఎంతో ఇబ్బందికి గురవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనం వల్ల గ్రామాల్లో అభివృద్ధి లేదని, వీధిదీపాలు లేవని, రోడ్డు, డ్రైనేజీలు సరిగ్గా లేవన్నారు. పంచాయతీ వర్కర్లకు సైతం జీతాలు సరైన సమయానికి రావడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయి ప్రతిపక్షాల మీద, ఏడవకుం డా ఇప్పటికైనా తొందరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

విత్తన నమూనాల సేకరణ



ఇచ్చోడలో విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో

ఇచ్చోడ, మే26, (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల కేంద్రంలోని విత్తన విక్రయాల దుకాణాల్లో సోమవారం మండల వ్యవసా యాధికారి భగత్‌రమేష్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా విత్తనాల స్టాక్‌నిల్వలు, రైతులకు పూర్తివివరాలు ఎమ్మార్పీ, విత్తనం తయారు అయిన తేదీతో సహా రైతు సంతకంతో ఇస్తున్నారా.. లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విత్తనాల నాణ్యత ప్రమాణాల కోసం విత్తన పరీక్షకేంద్రంలో, బీటీ జన్యువు ప్రోటీన్ నాణ్యత శాతం కోసం నమూన విత్తనాలను హైదరాబాద్‌కు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులకు విత్తనాలకు సంబంధించిన అన్ని వివరాలను చెప్పడమే కాకుండా బిల్లులో అన్ని వివరాలు నమోదు చేసి రైతుకు ఇవ్వాలన్నారు.

ప్రతీ రైతుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

ఇచ్చోడ, బజార్‌హత్నూర్, మే26, (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకంలో భాగంగా అగ్రిస్టాక్ పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ గుర్తింపు కార్డులను ఇస్తుందని పిప్రి ఏఈవో క్రిష్ణపాల్‌సింగ్ చౌహన్ తెలిపారు. సోమవారం పిప్రి గ్రామంలోని రైతువేదిక భవనంలో గిర్నూర్, కాండ్లి, కనకాయి, మోహద, వర్తమన్నూర్ గ్రామ రైతులకు సమావేశం నిర్వహించి రైతు గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించి కార్డులను జారీచేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం సీసీఎస్ బృందంతో కలిసి బెల్లూరి గ్రామ శివారులో దాడి చేశామన్నారు. ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఐదు మొబైల్ ఫోన్స్, రూ.28,140 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన



తాంసి మండలం పొన్నారిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తాంసి మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం టీబీ వ్యాధి మహమ్మారిగా మారిందని ఈ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ వైద్య సిబ్బంది సూచించారు. టీబీ వారోత్సవాలలో భాగంగా సోమ వారం మండలంలోని పొన్నారి గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ తులసిరాం, ఏఎన్ఎంలు లక్ష్మి, గంగమ్మ, సుజాత పాల్గొన్నారు.

31 నుంచి జొన్నల కొనుగోలు కేంద్రం బంద్

నేరడిగొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండల కేంద్రంలో గల జొన్నల కొనుగోలు కేంద్రంలో ఈనెల 31 నుంచి శాశ్వతంగా కొనుగోలు నిలిపివేయనున్నట్లు నేరడిగొండ పీఏసీఎస్ సెంటర్ ఇంచార్జి బారే నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంటను ఆ రోజు సాయంత్రం 5 గంటల లోపు మార్కెట్‌కు తీసుకురావాలని కోరారు. ఆ తరువాత పంటను కేంద్రంలో విక్రయించడానికి అవకాశం ఉండదని స్పష్టంచేశారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

నేటితో ఇంద్రవెల్లిలో జొన్న కొనుగోలు బంద్

ఇంద్రవెల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనసాగిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సాయంత్రంతో బంద్ చేసినట్లు పీఏసీఎస్ కార్యదర్శి ధరంసింగ్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రెలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జొన్న కొనుగోలు కేంద్రాన్ని బంద్ చేశామని, మండల రైతులు గమనించి జొన్నపంట అమ్మకానికి తీసుకురావద్దని, తీసుకున్న కొనుగోలు చేయ మని ఆ ప్రకటనలో తెలిపారు.

సర్వేయర్ల శిక్షణకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఆదిలాబాద్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం సోమవారం టీటీడీసీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ప్రక్రియ కొనసాగింది. కాగా ఈ ప్రక్రియలో పలువురు అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చిన అభ్యర్థులకు ఒరిజినల్ ధృవపత్రాలతోపాటు మెడికల్ సర్టిఫికెట్ కూడా అడగడంతో.. వారు వివిధ డాక్టర్ల వద్ద నుంచి మెడికల్ సర్టిఫికెట్లను తీసుకువచ్చారు. కానీ అవి చెల్లవని కేవలం సివిల్ సర్జన్ డాక్టర్ సంతకంతో తీసుకువచ్చిన సర్టిఫికెట్ మాత్రమే చెల్లుతుందని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో పలువురు అభ్యర్థులు అయోమయానికి గురయ్యారు. కాగా 50 రోజులపాటు జరిగే ఈ శిక్షణలో అభ్యర్థుల కోసం వసతి, భోజన సదుపాయం కల్పిస్తే బాగుంటుందని పలువురు అభ్యర్థులు కోరారు. శిక్షణలో అభ్యర్థులకు వసతి, భోజనం లాంటి ఏర్పాట్ల గురించి ఇంకా స్పష్టత రాలేదని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ తెలిపారు.



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

ఆటోడ్రైవర్ల పక్షాన పోరాడుతాం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మహాసభ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ , మే 26 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ కొట్లాడుతుందని, ఆటోడ్రైవర్ల పక్షాన నిలబడతామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆటో జేఏసీ నాయకులు సోమవారం ఎమ్మెల్యేను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న హైదరాబాద్ ఇందిరా పార్కులో జరగనున్న ఆటోఆకలి కేకల మహాసభకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూ.ఐదు వేలు విరాళంగా అందజేసి మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టంతో పూట గడిపే ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మోసం చేసి వారి ఓట్లు దండుకుందని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్ల కష్టాలను దృష్టిలో పెట్టుకొని వారికి న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున పోరాడుతామని అన్నారు.

నేరడిగొండ : ఆస్పత్రుల్లో చికిత్సపొందిన వారికి సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో మేలు చేస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో అందజేశారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన రాయిపెల్లి సుదర్శన్‌కు రూ. 14 వేలు, షేక్ శబానకు రూ. 60 వేలు, తాంసి మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన జిల్పెల్లి పద్మకు రూ. 28,500, జోగిమొగ్గ భాగ వాండ్లుకు రూ.12 వేలు, బోథ్ మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన కొక్కుల హర్ష వర్ధన్‌కు రూ.25,500, నేరడి గొండ మండలంలోని బొరిగావ్ గ్రామానికి చెందిన జాధవ్ శిల్పకు రూ. 60 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, శ్రీధర్ రెడ్డి, డాక్టర్ స్వా మి, పెంటన్న, రోహిదాస్, రాథోడ్ ప్రవీణ్, మహేందర్, రఫీ, భూషణ్, అనిల్ పాల్గొన్నారు.

మురుగునీటిని తొలగించాలి

ఇచ్చోడ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట అడేగామ(బీ) గ్రామానికి వెళ్లే ప్రధానరహదారిపై ప్రవహించే మురుగునీటిని తొలగించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం అధికారులకు ఆదేశించారు. ఇచ్చోడ మండల పర్యటనలో భాగంగా రోడ్లపై నిలిచిన మురగునీరు, వర్షపునీరు నిల్వ ఉండకుండా తగుచర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ ఈవో సురేష్, ఎంపీడీవో లక్ష్మణ్‌లకు ఎమ్మెల్యే సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



పిప్పల్‌కోటిలో చెక్కును అందజేస్తున్న అఫ్రోజ్

భీంపూర్ , మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన పెద్దింటి భూమన్న అనే వ్యక్తికి రూ.42 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు అనిల్ జాదవ్ యువసేన అధ్యక్షుడు షేక్ అఫ్రోజ్ నాయకులతో కలిసి లబ్ధిదారుడు భూమన్న ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా భూమన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చెక్కు పంపిణీలో నడుకుంటి భూమన్న శ్రీపతి నాగన్న, స్వామి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ సెంటర్‌ను పరిశీలించిన గోవర్ధన్ రెడ్డి



పరిశీలిస్తున్న గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఐఎంసీ) చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం, టాటా ఫౌండేషన్ సంయుక్తంగా రూ.40 కోట్లతో అందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5 కోట్లు, టాటా ఫౌండేషన్ వాటా రూ.35 కోట్లతో నిర్మిస్తున్న ఏటీసీ సెంటర్‌ను పరిశీలించి, పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. జూన్‌మాసం వరకు ఈ సెంటర్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా, ఆగస్టునెల వరకు పూర్తి కానుందని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఐటీఐ కళాశాలను అప్‌గ్రేడ్ చేయాలనే ఉద్దేశంతో ఏటీసీ సెంటర్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సెంటర్ కోసం ఆదిలాబాద్ జిల్లాకు ఓ ఎలక్ట్రికల్ కారు సైతం రావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రశాంత్, విక్రమ్ ఉన్నారు.

చట్టాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు : ఉట్నూర్ సీఐ



ఉట్నూర్ సీఐ మొగిలి

ఇంద్రవెల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ చట్టాలను దుర్వినియోగం చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఉట్నూర్ సీఐ మొగిలి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన తెలిపిన ప్రకారం... మండలంలోని గౌరపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రూప్‌సింగ్ తండా గ్రామానికి చెందిన సాబ్లేమాణిక్ చంద్ అనే వ్యక్తి మండలంలోని దన్నోరా (బీ) గ్రామంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా తలమడుగు మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన నైతం బాలు అనే వ్యక్తి ఇంటి నిర్మాణ పనులను ఆపి ఐటీడీఏ కోర్టులో ఫిర్యాదు చేసి ఎల్టీఆర్ కేసు నమోదు చేశారు. ఐదు లక్షల డబ్బులు ఇస్తే కేసును వాపస్ తీసుకుంటానని మాణిక్ చంద్రను డిమాండ్ చేశాడు. అయితే మాణిక్ చంద్ మే 2022 సంవత్సరంలో మూడు లక్షలు అప్పగించి కేసు వాపస్ తీసుకోవాలని కోరారు. కేసు వాపస్ తీసుకుంటానని మాట ఇచ్చి మోసం చేయడంతో అధికారులు భవన నిర్మాణ పనులను ఆపి ఎల్టీఆర్ కేసు నమోదు చేసి ప్రభుత్వ ఆధీనంలో తీసుకున్నారు. అయితే బాధితుడు సాబ్లేమాణిక్ చంద్ర స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నైతం బాలును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అతనితో పాటు ఇటీవల రిమాండ్‌కు తరలించిన బిపిన్‌కుమార్, మెస్రం ఆనంద్‌రావులపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అమాయకులపై కేసులు నమోదు చేయించి బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



ఇంట్లోంచి వెళ్లిపోయిన మహిళను కౌన్సిలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కనబడకుండా పోయిన మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత

ఖానాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో ఇంట్లోంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిన ఓ మహిళ ఆచూకీని కనుక్కొని పోలీసులు కుటుంబ సభ్యులకు ఆమెను అప్పగించిన ఘటన ఖానాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీకి చెందిన వెడ్మ అనసూయ అనే మహిళ కుటుంబ సమస్యల నేపథ్యంలో సోమవారికి ఎవరికి చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. దీంతో చుట్టు పక్కల వెతికిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని స్థానిక ఎస్సై రాహుల్ నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి దగ్గరకి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎస్పీ ఐటీ కోర్ ద్వారా అనసూయ డబుల్ బెడ్ రూమ్ కాలనీ దగ్గరలోనే అడవిలో ఉన్నట్లు లొకేషన్ గుర్తించారు. వెంటనే అనసూయను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

భైంసా, మే 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో విద్యుత్ సరఫరా వ్యవస్థలో నెలకొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గాను చర్యలు చేపట్టాలని భైంసా మండలంలోని మహగాం గ్రామస్థులు ట్రాన్స్‌కో అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంబంధిత విషయంలో గ్రామస్తులు భైంసా విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో విద్యుత్తు శాఖకు సంబంధించిన సిబ్బంది లేకపోవడం మూలంగా సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు పునఃరుద్ధరణకు సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. అంతే కాకుండా విద్యుత్తు శాఖకు సంబంధించిన పలు సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. అధికార యంత్రాంగం సత్వరమే స్పందించి గ్రామంలో విద్యుత్తు సరఫరా సమస్యలన్నింటినీ పరిష్కరించి సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.

‘ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి’

ఖానాపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఖానాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుజాతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొంత మంది అధికారుల అండదండలతో ప్రభుత్వమే సదరు నాయకుడు కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వమే కబ్జా చేయడమే కాకుండా అందులో అక్రమ నిర్మాణాలను సైతం చేపడుతున్నట్లు తహసీల్దార్‌కు వివరించారు. ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాల ఫోటోలతో సహా పూర్తి వివరాలను తహసీల్దార్‌కు అందజేశామని పేర్కొన్నారు. కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు విలాస్, రవి, రమేష్, తదితరులున్నారు.

బిల్లులు అందక ఇందిరమ్మ ఇళ్లకు అవాంతరాలు





అంతర్ని గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

కుభీర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు క్షేత్ర స్థాయిలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించిన ఇళ్ల నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగక పోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇంటికి సర్కారు విడతల వారిగా రూ. 5లక్షలు అందించనుంది. పునాది స్థాయి నిర్మాణం పూర్తయితే రూ. లక్ష, పిల్లర్లదశ దాటిన తర్వాత రూ. లక్ష, స్లాబు లెవల్ రూ. 1.50 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక రూ. 1.50లక్షల మంజూరు చేయనుంది. అయితే ఆర్థికంగా వెసులు బాటు లేక చాలా మంది లబ్ధిదారులు పనులు మొదలు పెట్టలేక పోతున్నారు. ప్రత్యామ్నాయాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించి ముందడుగు వేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో భాగంగా నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలో అంతర్ని గ్రామాన్ని పైలేట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులను గుర్తించారు. పక్కాగా సర్వే నిర్వహించి లబ్ధిదారులను తేల్చారు. మొత్తం 54మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 32 మంది లబ్ధిదారులు మాత్రమే పనులు ప్రారంభించారు. ఇందులో 15 మంది బేస్మిట్ లెవెల్ పూర్తి చేయగా, 17 మంది లబ్ధిదారులు పునాదుల తవ్వకానికే పరిమితమయ్యారు. మరో 13 మంది పనులు ప్రారంభించలేదు. 15 మంది బేస్మిట్ లెవెల్ పూర్తి చేసిన కేవలం ఏడుగురికి మాత్రమే రూపాయల చేరో లక్షల మంజూరయినట్లు పేర్కొన్నారు.

● **చేతిలో డబ్బులు లేక పనులు చేపట్టలేక పోతున్నాం...**

చేతిలో లేనివారు పనులు చేపట్టడం లేదు. రుణం ఇప్పిస్తామని చెప్పిన తాము కట్టుకునే స్థితిలో లేమని, కొందరు పాత ఇళ్లు కూలగొట్టి కొత్తగా నిర్మించుకోలేమని, మరికొందరు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని చెప్పిన అనేక చోట్ల అమలు కావడం లేదు. పునాదిస్థాయి నిర్మాణాలు పూర్తయిన పూర్తిస్థాయిలో లబ్ధిదారుల ఖాతాల్లో జామ కాక పోవడంతో మిగిలిన లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. బెస్మిట్ లెవల్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు త్వరగా బిల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

బోరిగాంలో తొలగించిన చోటే బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

● దళిత సంఘాల ఐక్యవేదిక డిమాండ్ ● భైంసాలో రిలే నిరహార దీక్షలు ప్రారంభం



భైంసాలో రిలే నిరహార దీక్ష చేస్తున్న దళిత సంఘాల నాయకులు, దళితులు

భైంసా, మే 26 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని ముథోల్ మండలం బోరిగాం గ్రామంలో అధికారులు తొలగించిన చోటే బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముథోల్ నియోజకవర్గ దళిత సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం సంబంధిత విషయంలో రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రిలే నిరహార దీక్షలను ప్రారంభించింది. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ.. అధికారులు కాలయాపనకు తావు లేకుండా బోరిగాం గ్రామంలో తొలగించిన చోట బుద్ధ విగ్రహాన్ని త్వరతగతిన ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా బోరిగాంలో బుద్ధ విహార్ కోసం రెండేకరాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. సమస్యను త్వరతగతిన పరిష్కరించని పక్షంలో ఛలో బోరిగాం కార్యక్రమం చేపడుతామని తెలిపారు. బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేసేంత వరకు భైంసాలో రిలే నిరహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు.

పోడు సాగు చేస్తున్న రైతులకు అధికారుల నుంచి రక్షణ కల్పించాలి

● ఎమ్మెల్యేకు వినతి అందించిన ఇటిక్యాల్ రైతులు

పెంబి, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు సాగుచేస్తున్న పోడు భూములను ఫారెస్ట్ అధికారులు లాక్కొని మా పొట్ట కొట్టడానికి చూస్తున్నారని ఇటిక్యాల్ గ్రామ రైతులు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ఫారెస్ట్ అధికారుల నుండి తమకు రక్షణ కల్పించాలని కోరారు. గిరిజనులతో పాటు దశాబ్దాలు సాగు చేస్తున్న భూములకు ఎన్నడూ లేని విధంగా ఆంక్షలు విధించారని తమ గ్రామ రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల్ గ్రామ రైతులు మహేందర్, షబ్బీర్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న ఇటిక్యాల్ రైతులు



వేర్లతో సహా వర్షానికి కూలిపోయిన చెట్టు దృశ్యం

భారీ వర్షాలకు వేర్లతో సహా కూలిన వృక్షం

నర్సాపూర్(జి), మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రాత్రి కురిసిన భారీ వర్షాలకు, సోమవారం ఈదురు గాలులకు ఒక పెద్ద వృక్షం వేర్లతో సహా కూలిపోయింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న సుమారు 40 సంవత్సరాల పురాతనమైన ఈ వృక్షం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భూమి మొత్తబడి, ఈ దురు గాలుల తీవ్రతకు తట్టుకోలేక వేర్లతో సహా పెకలించుకుపోయింది. మధ్యాహ్నం ఈ సంఘటన జరగడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. అయితే వృక్షం నీడకు పెట్టిన కారు, బైక్‌పై వృక్షం పడిపోవడంతో డామేజ్ అయ్యాయి. కేబుల్ వైర్లు తెగిపోయాయి. ఉపాధి హామీ కార్యాలయం ముందర ఉన్న చెట్టు జాతీయ రహదారిపై, వ్యవసాయ శాఖ కార్యాలయంపై పడితే ఆస్తి నష్టం జరిగేదని, అదృష్టవశాత్తు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది కాపీరాయుళ్ల పట్టివేత

భైంసా, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో సోమవారం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలో సోమవారం 11 మంది కాపీ రాయుళ్లను పట్టుకున్నట్లుగా కళాశాల ప్రిన్సిపల్ కర్రోళ్ల బుచ్చయ్య తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలో భాగంగా ముగ్గురు విద్యార్థులు, ఆరో సెమిస్టర్ పరీక్షలో 8 మంది విద్యార్థులను కలుపుకొని మొత్తం 11 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతుండగా బుక్ చేసినట్లుగా ప్రిన్సిపల్ తెలిపారు.

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : బీఆర్ఎస్

దిలావర్‌పూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా దగా చేస్తుందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎలాల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుబంధు, రైతుబీమా మొదలుకొని ఆఖరుకు వడ్ల విషయంలో కూడా రైతులను మోసం చేస్తోందని పేర్కొన్నారు. వడ్ల కొనుగోళ్లలో అంతులేని అవినీతి జరుగుతోందని ఆరోపించారు. క్వింటాల్ ధాన్యం వెనుక ఏడు కిలోల ధాన్యం తీసుకుంటున్నారన్నారు. 40 కేజీల ధాన్యం తూకం వేయాల్సి ఉండగా మూడున్నర కేజీలు అదనంగా తూకం వేస్తూ రైతులను ముంచు తున్నారని తెలిపారు. అదనంగా తూకం వేసిన ధాన్యం ఎవరి జేబుల్లోకి పోతున్నాయని ప్రశ్నించారు. కలెక్టర్ ఒక్క కిలో కూడా అదనంగా తూకం వేసేది లేదని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వేరుగా ఉందన్నారు. నాణ్య మైన ధాన్యానికి ఏడు కిలోలు అదనంగా తీసుకుంటుండగా, తడిసిన ధాన్యా నికి ఇంకెంత తీసుకుంటారోనని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ అవినీతి తతంగంపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేపట్టాలి

భైంసా, మే 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ కాలయాపన విధానాలకు తావులేకుండా రానున్న విద్యా సంవత్సరములో పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికి పాఠ్య పుస్తకాల పంపిణీ చేపట్టాలని బీజేవైఎం భైంసా డివిజన్ ప్రతినిధి గంగా ప్రసాద్ డిమాండ్ చేశారు. సంబంధిత విషయంలో సోమవారం భైంసాలో పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ప్రతియేటా పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరుగక విద్యార్థుకు అవస్థలు తప్పడం లేదన్నారు. ఇదే క్రమంలో ఏకరూ దుస్తుల పంపిణీ సైతం విద్యా సంవత్సరం ఆరంభంలో పూర్తి చేయాలన్నారు.


మొలకెత్తిన వడ్లు


గన్నీ బ్యాగుల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు


గన్నీ బ్యాగులు ఇవ్వాలని సెంటర్ నిర్వాహకుడిని అడుగుతున్న రైతులు

గన్నీ బ్యాగుల కోసం పడిగాపులు!

● పడిగాపులు కాస్తున్న రైతులు ● మొలకెత్తినా అందని గన్నీ బ్యాగులు

మామడ, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఎటువంటి కష్టాలు కలుగవద్దని, తడిసిన ధాన్యం సైతం కొంటామని హామీ ఇచ్చినా క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు నిర్వాహకులు గన్నీ బ్యాగులు వచ్చినా రైతులకు అందజేయకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారు. మామడ మండలంలోని దిమ్మదుర్తి క్లస్టర్ పరిధిలోని కప్పన్‌పల్లి, నల్దుర్తి, ఎక్బాల్‌పూర్ గ్రామాల రైతులు దిమ్మదుర్తి ఐకేపీ సెంటర్‌లో రైతులు 15 రోజులకు పైగా వడ్లు పోసిన ఒక వైపు వర్ష ప్రభావం వడ్లు తడవకుండా ఇబ్బందులు పడుతూ కాపాడు కుంటూ వస్తున్న వడ్లు


మొలకెత్తిన వడ్లను చూపిస్తున్న రైతు సుదర్శన్

మొలకలు వచ్చి తడిసి పోతున్న సెంటర్ నిర్వాహకులు మాత్రం గన్నీ బ్యాగుల కొరత అంటూ తూకంలో కొరత అంటూ చాలా ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా గన్నీ బ్యాగుల సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు. తూకంలో కటింగ్ లేకుండా రైతులను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు గాలం పండించిన పంట చేతికి వచ్చే దశలో విపత్తు కనికరించ లేదని, ప్రభుత్వం ఆదుకొని సమస్య పరిష్కరించాలని వాపోతున్నారు.

● రెండు రోజుల్లో ప్రతీ ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలిస్తాం..

- అరుణ, ఏపీఎం, మామడ

అకాల వర్షం కారణంగా వరి కొనుగోలు సెంటర్‌లో ధాన్యం మిగిలిపోయింది. ఒక రెండు రోజుల్లో గన్నీ బ్యాగులు ఇచ్చి తూకం వేసి రైస్ మిల్లులకు తరలిస్తాం. వర్షం కారణంగా భూమి తడ వడంతో భారీ వెహికల్ గన్ని బ్యాగ్స్ తీసుకువెళ్లడానికి ఇబ్బంది అవుతుంది. రైతులకు నష్టం కాకుండా రైస్ మిల్‌కు తరలిస్తాం. మా సిబ్బందికి ఎప్పటికప్పుడు చెబుతున్నాం.

● గన్నీ బ్యాగ్స్ ఉన్నా ఇవ్వడం లేదు..

- ఎస్. నాగన్న రైతు, నల్దుర్తి



దిమ్మదుర్తి ఐకేపీ సెంటర్‌లో 15 రోజుల కిందట వడ్లు పోసిన ఇప్పటివరకు గన్నీ బ్యాగ్స్ ఇవ్వడం లేదు. సెంటర్ నిర్వాహకులను ఎన్నిసార్లు అడిగిన రేపు.. మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికే అకాల వర్షంతో చాలా నష్టపోతున్నాం. ఇకనైనా గన్ని బ్యాగ్స్ ఇచ్చి తూకం చేసి రైస్ మిల్‌కు పంపాలని కోరుతున్నాము. లేనియెడల ఈ వర్షాలతో ఆరుగాలం పండించిన పంట నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలి.


కుమురంభీం చౌరస్తాలో నడిరోడ్డుపై మందులను విక్రయిస్తున్న దృశ్యం


రోడ్డుపైనే భారీ వాహనంలో నుంచి అన్‌లోడ్ చేస్తున్న సిమెంటు బస్తాలు

ఫోకస్

రద్దీ రోడ్లపై దర్జాగా పార్కింగ్

● ఇచ్చోడ ప్రధాన రహదారిపైనే ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్ ● రోడ్డుపైనే వ్యాపారుల విక్రయాలు

ఇచ్చోడ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ ప్రధాన రహదారులను చాలా మంది పార్కింగ్ అవసరాలకు, చిరు వ్యాపారులకు వాడు కుంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై దర్జాగా వంద లాది వాహనాలు పార్క్‌చేస్తున్నా.. పోలీసులు పట్టించుకోక పోవడం గమనార్హం. ఇందుకు ఉదాహరణ అత్యంత రద్దీగా ఉండే కొమురంభీం కూడలిలో ఓ వ్యాపారి ఏకంగా కారును అడ్డంగా నలిపి రోడ్డు మధ్యలో గొడుగునీడ చేసుకుని బ్యాటరీ సహాయంతో మైక్ పెట్టి మరీ మందులను విక్రయిస్తున్నా.. పోలీసులకు వినపడడం లేదు. సిరికొండ మండలానికి వెళ్లే కూడలిలో తొపుడుబండ్లు రోడ్డు మధ్యలో నిలిపిపండ్లను విక్ర యిస్తున్నారు. ఇదే కూడలిలో ఉదయం నుంచి రాత్రి వరకు పోలీ సులు విధులు నిర్వహిస్తుంటారు. అక్కడే రోడ్డుపై అక్రమంగా వాహనాలు నిలుపుతున్నా కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నో పార్కింగ్ అంటూ పోలీసులు ఏర్పాటుచేసిన సూచికను సైతం పట్టించుకోకుండా అక్కడే వాహనాలు నిలుపుతున్నారు. ఫలితంగా ఇటుగా రాకపోకలు సాగించే వారు అనేక ఇక్కట్లు పడుతున్నారు. సాధారణ ప్రజలు ఎవరైనా రోడ్డు పక్కనే ద్విచక్రవాహనం ఐదు నిమిషాలు నిలిపితే పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. ఇచ్చోడ ప్రధాన రోడ్లపై యథేచ్ఛగా వాహనాల పార్కింగ్‌కు వాడుకుంటున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం శోచనీయం. ఇచ్చోడలో ఇష్టారీతిన ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇక్కడి పోలీసు సిబ్బందికి సూచించిన స్పందన లేకుండా పోయింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌ను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు మధ్యలో తోపుడుబళ్లపై పండ్లను విక్రయిస్తున్న చిరువ్యాపారులు

నాలుగు నెలలుగా ఆగిన రోడ్డు నిర్మాణ పనులు

● టెండర్ పూర్తయినా ప్రారంభం కాని బ్రిడ్జి నిర్మాణ పనులు ● స్పందించని అధికారులు ● ఆందోళన చెందుతున్న మామిడిగూడల ఆదివాసీలు

ఆంధ్రజ్యోతి పరిశీలన


నిర్మించిన మట్టి రోడ్డు


నిర్మించిన కల్వర్టు


వాగు వద్ద ప్రారంభం కాని బ్రిడ్జి నిర్మాణ పనులు

ఇంద్రవెల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హర్కపూర్, అంద్‌గూడ గ్రామ పంచాయితీ పరిధిలోని మామిడిగూడ (జి), మామిడిగూడ (బి), గ్రామాల ఆదివాసీలు దీర్ఘకాలంగా పడుతున్న రోడ్డు సమస్యను పరిష్కరించడానికి గత ప్రభుత్వం తారు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కాని అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. నాలుగు నెలల నుంచి రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారు మధ్యలో ఆపివేశాడు. వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కూడా నిధులు మంజూరై ఇటీవల టెండర్ పూర్తి చేసిన గుత్తేదారు ఇంక పనులను ప్రారంభించలేదు. దీంతో ఆ రెండు గ్రామాల ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది కూడా వర్షకాలంలో తమకు కష్టాలు తప్పేలా లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టి సారించి ఆగిన రోడ్డు పనులతో పాటు వాగు వద్ద బ్రిడ్జి నిర్మించి వర్షకాలంలో రోడ్డు సమస్య లేకుండా చూడాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

● ముందుకు సాగని పనులు

మండలంలోని అంజి గ్రామ పంచాయితీ పరిధిలోని మామిడిగూడ (ఏ) నుంచి రెండు కిలో మీటర్ దూరంలో ఉన్న హర్కపూర్, అంద్‌గూడ గ్రామ పంచాయితీ పరిధిలోని మామిడిగూడ (బి), మామిడిగూడ (జి) గ్రామాలకు రోడ్డు లేక మధ్యలో ఉన్న వాగు వద్ద బ్రిడ్జి లేకపోవడంతో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ప్రాణాలను పనంగా పెట్టి వాగు దాటి రాకపోకలు సాగిస్తున్నారు. రెండు గ్రామాల ఆదివాసీలు పడుతున్న అవస్థలను దృష్టిలో ఉంచుకుని శాశ్వతంగా వారి సమస్యను పరిష్కరించడానికి గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల చొరవతో 2023లో మామిడిగూడ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. ఒక కోటి రూపాయలు, వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.3 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణ పనులకు టెండర్ పూర్తి చేసిన ఐటీడీఏ అధికారులు ఓ గుత్తేదారుకు అప్పగించగా గుత్తేదారు పనులు ప్రారంభించి కేవలం మట్టి రోడ్డు, చిన్న చిన్న కల్వర్టుల పను లు పూర్తి చేసి నాలుగు నెలలుగా పనులను ఆపేశాడు. అదే విధంగా బ్రిడ్జి నిర్మాణ పనులకు పంచాయితీ రాజ్ అధికారులు ఇటీవలే టెండర్ పూర్తి చేసి ఓ గుత్తేదారుకు అప్పగించారు. కాని బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఈ ఏడాది కూడా తమకు కష్టాలు తప్పేలా లేవని ఆ గ్రామాల ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. నిధులు మంజూరైన ఐటీడీఏ, పంచాయితీ రాజ్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదని ఆరోపిస్తున్నారు. ఇంకేన్నాళ్ళు ఈ కష్టాలు పడాలో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆగిన రోడ్డు పనులు పూర్తి చేయడంతో పాటు వాగు వద్ద బ్రిడ్జి నిర్మించి తమ గ్రామాలకు రోడ్డు సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

● రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం విషయంలో అధికారులు స్పందించడం లేదు



మా గ్రామాలకు రోడ్డు, వాగు బ్రిడ్జి లేక ప్రతి సంవత్సరం వర్షాకాలంలో అవస్థలు పడుతున్నాం. నిధులు మం జూరైన అధికారులు నిర్లక్ష్యం చేస్తు న్నారు. గుత్తేదారు మట్టి, చిన్న కల్వర్టు పనులు చేసి మధ్యలోనే పనులను ఆపివేశాడు. రోడ్డు పనుల విషయంలో అధికారులకు ఫోన్ ద్వారా సంప్రదిస్తే ఎవరూ కూడా స్పందించడం లేదు. ఇప్పటికైనా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అధికారులు దృష్టిసారించి రోడ్డు పనులు పూర్తి చేసి వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేసి రోడ్డు సమస్య లేకుండా చూడాలి.

- సెడ్మాకి భీంరావు, మామిడిగూడ (బి) గ్రామ నివాసి

● రోడ్డు సమస్య లేకుండా చూడాలి



మా రెండు గ్రామాలకు రోడ్డు లేక వాగు వద్ద బ్రిడ్జి లేక వర్షాకాలంలో అవస్థలు పడు తున్నాం. ప్రాణాలను పనంగా పెట్టి వరద నీటిని దాటి రాకపోకలు సాగించి అవస్థలు పడుతున్నాం. అత్యవసర సమయంలో వాహనాలు రాక, ఆసుపత్రులకు వెళ్లలేక పోతున్నాం. చాలా కష్టమవుతుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయ డంతో పాటు వాగు వద్ద బ్రిడ్జి నిర్మించి మా గ్రామాలకు రోడ్డు సమస్య లేకుండా జాగ్రత్త లు తీసుకోవాలి.

- మెస్రం నాగోరావు, మామిడిగూడ (బి) నివాసి

రోడ్డుపైనే సంత.. ప్రమాదాలకు చెంత


సుంకిడిలో ప్రతీ ఆదివారం అంగన్‌వాడీ ఏర్పాటు చేయడంతో రద్దీగా మారుతున్న అంతర్రాష్ట రహదారి

తలమడుగు, మే 26 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి అంతర్రాష్ట్ర రహదారిపై గత సంవత్సరం నుంచి ప్రతీ ఆదివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో అంగడి సంత ఏర్పాటు చేయడంతో రోడ్లపై నే దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అసలే అంతరాష్ట్ర రహదారి అతివేగంగా వాహనాలు నడుపుతున్న ఎ వరు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అతివేగం తో వాహనాలు నడపడం వల్ల పలు ప్రమాదాలు చోటుచేసుకుని మృత్యు వాత పడుతున్న ఎవరు స్పందించడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంగడి ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రజలకు కొంత సౌకర్యంగానే ఉన్నప్పటికీ రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించినట్లు ఇక్కడ కూడా సమస్యలు పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

అడెల్లి రోడ్డు పూర్తయ్యేదెన్నడో!?

బోథ్, మే 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ధన్నూర్ గ్రామం మీదుగా నిర్మించిన అడెల్లి రోడ్డు పూర్తిస్థాయిలో నిర్మాణం కాకపోవడంతో రోడ్డుపై ద్విచక్ర వాహనాల వారు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారు. బోథ్ మండలంలోని కుచలాపూర్, ధనుర్ మీదుగా వేసిన రోడ్డు పైన కేవలం ఒక 150 మీటర్లు దూరం మాత్రమే మట్టి రోడ్డు ఉండడంతో ద్విచక్ర వాహనాల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అంటే ఈ రూట్ లోనే పెద్ద మొత్తంలో ఈ ప్రాంత ప్ర యాణికులు వెళ్తుంటారు అయితే వర్షానికి 150 మీటర్ల రోడ్డు బురద మాయంగా మారడంతో ద్విచక్ర వాహనాలు బురదలో కూరుకుపోయి ముందు కలవడం లేదు. జిల్లా అధికారులు, పాలకులు ఈ రోడ్డుపైన మొరం సల్లించినట్లయితే ప్రయాణికుల ఇబ్బందులు తొలిగే ఆస్కారం ఉంది. ఆలోచించి నిధులు మంజూరు చేయించాల్సిన అవసరం ఉం దని భక్తులు కోరుతున్నారు.


ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయమైన అడెల్లి రోడ్డు

కొలాం ఆది వాసులకు నీటి కష్టాలు

నార్నూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంత కొలాం ప్రజలకు నీటి, విద్యుత్ ఇతర కష్టాలు ఉన్న ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదంటూ మండలకేంద్రం డబుల్ బెడ్ రూం కొలాం ఆదివాసులు వాపోయారు. పది హేను ఇండ్లు ఉన్న ఇక్కడ నీటి బోర్, విద్యుత్ సదుపాయం, సైడ్రెన్ లేక తీవ్రంగా ఇబ్బంది పడతున్నారు. సంబంధిత అంశాలపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం పరంగా జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకోవడం లేదు పేర్కొన్నారు.

అమ్మి నెల రోజులైనా.. అందని జొన్నల డబ్బు

● జిల్లా వ్యాప్తంగా రూ.147 కోట్ల బకాయిలు

తాంసి, మే 26 (ఆంధ్రజ్యోతి): జొన్నలు అమ్మి నెల రోజులు గడిచిపోయినా ఇంకా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. వాస్తవానికి జొన్నలు విక్రయించిన మూడు, నాలుగు రోజుల్లోనే సంబంధిత రైతు ఖాతాలో డబ్బులు జమ కావాల్సి ఉంటుంది. కాని అధికారుల నిర్లక్ష్యమో.. లేక డబ్బులు లేకనో తెలియదు గాని నేటికీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. దీంతో జొన్న రైతుల కష్టాలు అంతా ఇంతా కావు. జొన్న విత్తనాలు నాటిన నుంచి జొన్నలను విక్రయించే వరకు ఆ రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణానాతీతం అని చెప్పవచ్చు. ఈ ఏడు జిల్లా వ్యాప్తంగా లక్షా 11 వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. వాతావరణం అనుకూలించడం తో ఎకరానికి 12 క్వింటాళ్ల నుంచి 19 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. వ్యాపారులను ఆశ్రయించి మోస పోకుండా ఉండేందు కోసం జిల్లా వ్యాప్తంగా 16 జొన్నల కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ గత నెలలో ఏర్పాటు చేసింది. రైతులు నేరుగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించుకుం టున్నారు. క్వింటాల్ జొన్నలు ప్రైవేట్‌కు అమ్మితే రూ.2,400 నుంచి 2,500 కొనుగోలు చేసేవారు. కాని కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు జొన్నలకు రూ.3371 ప్రకటించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రైతులంతా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయి స్తున్నారు. సోమవారం వరకు జిల్లా వ్యాప్తంగా 32,417 మంది రైతులు జొన్నలను విక్రయించారు. వీరి ద్వారా 4.68 లక్షల క్వింటాళ్లను కొను గోలు చేశారు. సుమారు 147 కోట్లకుపైగా రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. మండల కేంద్ర మైన తాంసి సహకార సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 66 వేల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వెంటనే జొన్న రైతులకు ఖాతా లో డబ్బులు జమ చేయాలని తాంసి, భీంపూర్, తల మడుగు మండలాలకు చెందిన జొన్న రైతులు కోరు తున్నారు.


రోడ్డుకు ఇరువైపులా అమ్మకానికి సిద్ధంగా ఉన్న జొన్నలు

● చాలా ఇబ్బందిగా ఉంది



తాను జొన్నలు అమ్మి 35 రోజులు కావస్తుంది. జొన్నలు విక్రయిస్తే వచ్చిన డబ్బులతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయవచ్చని సంతోషపడ్డాను. కాని ఇప్పటి వరకు డబ్బులు అందలేదు. దీంతో తమకు తీవ్ర ఇబ్బందులు తలెత్తు తున్నాయి. వెంటనే అధికార యంత్రాంగం, ప్రభుత్వం జొన్న డబ్బులను అందించాలి.

- రవీందర్, రైతు గుబ్‌డి

● త్వరలోనే జమ కావచ్చు

జొన్న రైతులు పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. త్వరలోనే జమ కావచ్చు. ఇప్పటి వరకు ఏ ఒక్క ఖాతాలో కూడా డబ్బులు జమ కాలేదు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. మరో మూడు, నాలుగు రోజుల్లో జొన్నల కొనుగోలు పూర్తి కావాల్సి ఉంది.

- కేశవ్, సీఈవో

తొలకరికి ముందే కురిసిన వాన

● మురిసిన రైతన్న.. ● కట్టల పద్ధతి ద్వారా పత్తి విత్తనాలు నాటిన రైతు

తలమడుగు, మే 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు ముందే తొలకరి పులకరించడంతో రైతన్న మురిసి పోయారు. ప్రతీ సంవత్సరం వర్షాల కోసం ఎదురు చూసే రైతన్న ఈ సంవత్సరం ముందే వర్షాలు రావడంతో అదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రానికి చెందిన నల్ల పద్మకర్ రెడ్డి కట్టల పద్ధతి ద్వారా సోమవారం తన వ్యవసాయ పొలంలో ఐదు ఎకరాల్లో పత్తి విత్తనాలను, మరో ఐదు ఎకరాల్లో పసుపు పంటను కూలీల ద్వారా నాటించారు. కట్టెల పద్ధతి ద్వారా పత్తి విత్తనాలు నాటడంతో సాగు నీటిని పొ దుపుగా వాడుకోవచ్చు, కలుపు మొక్కల నివారణ బెడద తక్కువగా ఉంటుందని, కూలీల ఖర్చు కూడా తక్కువగా ఉంటుందన్నారు. ఈ సంవత్సరం వ్యవసాయ పొలంలో మట్టి కట్టల పద్ధతిలో పత్తి విత్తనాలను నాటించడం జరిగిందని రైతు తెలిపారు. ఖరీఫ్ పంట తొందరగా చేపడితే త్వరగా చేతికొచ్చి రబీ పంటను త్వరగా చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు.


తలమడుగలో తొలకరికి ముందే పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు




బాసర గోదావరిలో మునిగి మృతి చెందిన బొల్ల మల్లరాజు.. బాలుడు బాలసాహెబ్ దేశ్‌ముఖ్ మృతదేహం

బాసర గోదావరిలో ఇద్దరి దుర్మరణం

● ప్రమాదవశాత్తు నదిలో దిగి వేర్వేరు ఘటనల్లో మృతి

బాసర, మే 26 (ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద గోదావరి నదిలో సోమవారం ఇద్దరు భక్తులు దుర్మరణం చెందారు. గోదావరి స్నానానికి నదిలో దిగిన వీరిద్దరూ వేర్వేరు ఘటనల్లో ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించారు. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని పర్భణి జిల్లా టాక్లి గ్రామానికి చెందిన కుల్‌దీప్ బాల సాహెబ్ దేశ్‌ముఖ్ (12) అనే బాలుడు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి బాసరకు వచ్చాడు. పుణ్యస్నానానికి అని నదిలో దిగాడు. కుటుంబ సభ్యులంతా ఒకచోట ఉండగా.. బాల సాహెబ్‌దేశ్‌ముఖ్, మరో బాలుడు కలిసి తాగు నీటి పంపు హౌజ్ వద్ద స్నానానికి దిగారు. పంపు హౌజ్ కోసం నదిలో తవ్విన కాల్వను గమనించకపోవడంతో.. లోతు తక్కువగా ఉందని భావించి అక్కడ స్నానం చేసేందుకు ప్రయత్నించి నీట మునిగి మృతి చెందాడు. మరో బాలుడు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అలాగే నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన బొల్ల మల్లరాజు (40) నదీ స్నానానికి వెళ్లి కాలు జారి నీట మునిగి మృతి చెందాడు. ఒకే రోజు రెండు ఘటనల్లో ఇద్దరూ మృతి చెందడంతో నదీ తీరంలో విషాదం నెలకొంది. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకొని బాసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పాటుకు భయపడి..

స్పృహ కోల్పోయిన పిల్లలు

● తప్పిన ప్రాణాపాయం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

దిలావర్‌పూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం సాయంత్రం పొద్దుపోయాక ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గుండంపల్లిలో ఊర చెరువు సమీపంలో పెద్దశబ్దంతో పిడుగుపడింది. చెరువు కట్ట సమీపంలోనే మహారాష్ట్రకు చెందిన కుటుంబాలు నివాసముంటున్నాయి. అయితే ఆ పిడుగు కాంతివంతమైన వెలుతురు, భారీ శబ్దానికి మహారాష్ట్రకు చెందిన ఆకాష్, జ్యోతి అనే పిల్లలు స్పృహ కోల్పోయి అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో స్పృహ కోల్పోయిన ఇద్దరు పిల్లలను 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స ప్రారంభించిన వైద్యులు ప్రాణాపాయం లేదని ప్రకటించారు. ప్రస్తుతం పిల్లలు కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. పిడుగుదూరంగా పడటంతో పిల్లలకు ప్రాణాపాయం తప్పింది. కేవలం వెలుతురుతో పాటు భారీ శబ్దంతోనే పిల్లలు భయపడి స్పృహ కోల్పోయినట్లు తెలిపారు.

భూగర్భ జలానికి ముప్పు!



- జిల్లాలోని భూగర్భ జలాల్లో ఉప్పు నైట్రేట్‌లు
- మోతాదుకు మించి ఉండటంతో పంటలపై దుష్పరిణామాలు
- సాగుకు ఉపరితల నీరే వాడాలంటున్న అధికారులు
- రైతులకు అవగాహన కోసం జిల్లా అంతటా విస్తృత ప్రచారం

నిర్మల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూగర్భ జలాలకు క్రమక్రమంగా ముప్పు ఏర్పడుతున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటుండడం ఆందోళన కలిగిస్తుంది. జిల్లాలో దాదాపు 70 వేలకు పైగా వ్యవసాయ బోరు బావులున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇవే కాకుండా తాగునీరు, ఇంటి అవసరాల కోసం కూడా పెద్దసంఖ్యలోనే బోరు బావులు న్నాయి. అయితే గత కొన్ని ఏళ్ల నుంచి రైతులు పంటలసాగు కోసం పెద్ద మొత్తంలో రసాయనిక ఎరువులు వినియోగిస్తున్న కారణంగా భూగర్భ జలాలు క్రమంగా విషపూరితమవుతున్నాయి. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం కారణంగా భూగర్భ జలాలు విష తుల్యమవుతున్నాయంటూ గతంలోనే భూగర్భ జలశాఖ అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా కడెం ప్రాజెక్టు పరిధిలో ఇప్పటికే రసాయనిక ఎరువుల వినియోగం కారణంగా భూగర్భజలాలు విషపూరితంగా మారి నట్లు అధికారుల నివేదికలు వెల్లడించాయి. అయితే ఇటీవలే సంబంధిత శాఖ అధికారులు భూగర్భ జలాలను ప్రత్యేకంగా పరీక్షించడంతో విషపూరితమవుతున్న నీటి ఆనవాళ్లు బయటపడ్డాయి. సంబంధిత అధికారులు చేపట్టిన భూగర్భ జల పరీక్షలలో సెలెనిటీ (ఉప్పుతెట్ట) జిల్లాలో అత్యధికంగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతోపాటు ఇక్కడి భూగర్భ నీటిలో నైట్రేట్ల శాతం కూడా అత్యధికంగా ఉన్నట్లు తేలింది. దీంతో రైతులు ఇక నుండి భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గిస్తూ ఉపరితల జలాలను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగానే వర్షపునీరుతో పాటు చెరువులు, కాలువలు, చెక్‌డ్యామ్‌ల నీటిని పంటల సాగుకోసం వినియోగించాలంటూ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే భూగర్భ జలశాఖ అధికారులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికోసం గాను మొబైల్ ల్యాబ్ వెహికల్‌తో ఎంపిక చేసిన గ్రామాల్లో అక్కడి భూగర్భ జలాలను రైతుల సమక్షంలోనే పరీక్షించి అవగాహన కల్పిస్తున్నారు.

భూగర్భంలో విపరీతంగా ఉప్పు తెట్ట శాతం

పంటలపై రసాయనిక ఎరువులు, పెస్టిసైడ్స్ వినియోగం విపరీతంగా పెరిగిపోతున్న కారణంగా భూగర్భ జలాలు వేగంగా విషపూరితమవుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలో రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిపోయిన కారణంగా భూగర్భంలో ఉప్పుతెట్ట (సెలెనిటీ) శాతం గణనీయంగా పెరిగిపోతోంది. దీంతో నీరు సహజత్వాన్ని కోల్పోయి పూర్తి స్థాయిలో ఉప్పు నీటిగా మారిపోతుందంటున్నారు. ఉప్పు తెట్ట కారణంగా ఆ నీటిని పంటలకు వినియోగిస్తే దిగుబడులు తగ్గిపోతాయని అలాగే పంటలు వివిధ రకాల తెగుళ్ల బారిన పడతాయని చెబుతున్నారు.

ఊరూరా అవగాహన కార్యక్రమాలు

భూగర్భజలాల్లో ఉప్పు తెట్ట, నైట్రేట్ల శాతం పెరిగిపోతున్న కారణంగా సంబంధితశాఖ అధికారులు రైతులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించేందుకు పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్నారు. భూగర్భ జలశాఖ, వ్యవసాయశాఖతో పాటు వ్యవసాయ పరిశోధన కేంద్రాలకు సంబంధించిన అధికారులు ప్రత్యే కంగా రూపొందించిన మొబైల్ ల్యాబ్ వెహికల్‌తో గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులందరినీ సమీకరించి అక్కడి భూగర్భ జలాలను ఈ మొబైల్ ల్యాబ్ వెహికల్‌లోని లాబరేటరీలో పరీక్షించి రైతులకు వివరిస్తున్నారు. రైతులు క్రమంగా రసాయనిక ఎరువులు, పెస్టిసైడ్స్ వినియోగాన్ని తగ్గించాలని అలగే భూగర్భ జలాలైన వర్షం నీరు, చెరువులు, కాలువలు, చెక్ డ్యామ్‌ల నీటిని ఎక్కువగా పంటల సాగు కోసం వినియోగించాలని సూచిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

శ్రీనివాసరావు, డీడీ, భూగర్భ జలశాఖ, నిర్మల్

భూగర్భ జలాల్లో విపరీతంగా పెరిగిపోతున్న ఉప్పు తెట్ట, నైట్రేట్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దీనికోసం గాను ఎంపిక చేసిన గ్రామాల్లో మొబైల్ ల్యాబ్ వెహికల్‌తో పర్యటిస్తున్నాం. అక్కడ రైతుల సమక్షంలోనే భూగర్భ నీటిని పరీక్షించి నీటిలో ఉన్న ఉప్పు తెట్ట, నైట్రేట్‌తో పాటు ఇతర విషపూరిత కారకాలపై వివరిస్తున్నాం. రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచిస్తున్నాం. ఉపరితల నీటిని వినియోగించే విధానాలపై అవగాహన కల్పిస్తున్నాం.




భూగర్భ జలాల లభ్యత, వినియోగం, నాణ్యతపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలి

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్


బ్రహ్మన్‌గాం గ్రామంలో రోడ్లను పరిశీలిస్తున్న డీపీవో

ముథోల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బ్రహ్మన్‌గాం, గన్నోర గ్రామాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని రోడ్లు, మురికి కాలువలు, సెగ్రిగేషన్ షెడ్లు పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా మురికి కాలువలు శుభ్రం చేయాలని, గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై చెత్త పడకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. అలాగే సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో సుదర్శన్, ఎంపీడీవో శివ కుమార్, కార్యదర్శులు రాజ్ కుమార్, కృష్ణ, తదితరులున్నారు.

బడిబాటలో అందరూ పాల్గొనాలి : డీఈవో


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రామారావు

కుబీర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని డీఈవో రామారావు అన్నారు. సోమవారం మండలంలోని పల్సి పాఠశాలను సందర్శించి పోషకులతో సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే సదుపాయాల గురించి గ్రామాల్లో ప్రతి ఒక్కరికి వివరించాలని, బడిఈడు పిల్లలను బడికి పంపే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. వచ్చే నెల 6వ తేదిన ప్రారంభం కానున్న బడిబాటలో భాగంగా పాఠశాలలో నమోదును గణనీయంగా పెంచడంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేస్తూ ప్రభుత్వం బడులపై నమ్మకం కలిగేలా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు ఉచిత సమదుస్తుల పంపిణీ, దృష్టి సారించాలని , నేరుగా స్టిచ్చింగ్ పాయింట్స్ వెళ్లి సూచనలు చేయాలన్నారు. పాఠశాలలు ఆ గ్రామం ఆవాసంలో ఉన్నటువంటి విద్యార్థుల యొక్క వివరాలను విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టార్ ద్వారా పొందుపరచాలన్నారు. ఈయన వెంట హెడ్‌మాస్టర్ సురేష్, ఉపాధ్యాయులు, పోషకులు తదితరులున్నారు.

బాలికకు ఆర్థికసహాయం అందజేత

లక్ష్మణచాంద, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన వెన్నెల శరణ్య అనే బాలికకు వద్యాల్‌కు చెందిన గంధం సాయన్న కుటుంబం రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించింది. శరణ్య తీవ్ర అనారోగ్యానికి గురైంది. నిర్మల్‌లో చికిత్స చేయించినప్పటికీ పరిస్థితి మెరుగుపడలేదు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేదలు కావటంతో మళ్లీ నిర్మల్ తీసుకొచ్చి సాధారణ చికిత్స అందజేస్తున్నారు. ప్రస్తుతం ఆ బాలిక చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దీంతో ఈ బాలికను ఆదుకోవాలని, ఆర్థిక సహాయం అందించాలని పలువురు కోరారు. ఈ విషయం తెలుసుకున్న వద్యాల్ గ్రామానికి చెందిన గంధం సాయన్న, ఇతని కుటుంబ సభ్యులంతా కలిసి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చి ప్రజల దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. రైతు రుణమాఫీ, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, వైద్యం, విద్య, తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కారం వచ్చిన ప్రతి దరఖాస్తుపై వివరాలు రిమార్కుల విభాగంలో నమోదు చేసి, దరఖాస్తుదారులకు సమాచారం అందించాలన్నారు. అలాగే రాజీవ్‌యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని, వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా కొనసాగించాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై వైద్య శాఖ ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్ర మాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన అభినయను అభినందించిన కలెక్టర్



జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని పి. అభినయను కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్‌తో కలిసి అభినందించారు. ఈ నెల 24 నుంచి 26 వరకు మంచిర్యాల ఎఫ్‌సీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్ యూత్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఏడుగురు బాక్సర్లు పాల్గొన్నారు. ఇందులో పి. అభినయ (54-57 వెయిట్ కేటగిరీ), ఏ. కీర్తన (46-48 కేటగిరీ), శ్రావణి (64-67 కేటగిరీ) బంగారు పతకాలు, సిహెచ్. నక్షత్ర (80 ప్లెస్ వెయిట్ కేటగిరీ) కాంస్య పతకం సాధించారు. పతకాలు గెలుచుకున్న అభినయ, కీర్తన జూన్ 4 నుంచి 7 వరకు గోవా రాష్ట్రం మపుసలో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ అండర్- 17 బాలికల బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వ కారణంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

● ఏఎస్పీ అవినాష్ కుమార్


కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్

భైంసా రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ అవినాష్ తెలిపారు. భైంసా మండలంలో సోమవారం మీర్జాపూర్ గ్రామంలో జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఆదేశాల మేరకు ఏఎస్పీ అవినాష్ పర్యవేక్షణలో భైంసా రూరల్ సీఐ నైలు, ఎస్సై సుప్రియ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలను, 3 ఆటోలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అవినాష్‌కుమార్ మాట్లాడుతూ... ప్రజలరక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని అన్నారు. కాలనీలో కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత చెడు అలవాట్లకు గంజాయి, మద్యం, డ్రగ్స్‌లకు బానిసగా మారి జీవితలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని లేదా సమస్యలుంటే 100కు కాల్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కాలనీలో మరింత స్వీయరక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నైలు, ఎస్సైలు రవీందర్, అశోక్, ప్రొబేషనరీ ఎస్సై సుప్రియ, పోలీసుసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి సీతక్క రాక

లోకేశ్వరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు మంత్రి సీతక్క మంగళవారం రానున్నారు. లోకేశ్వరంలో కొమరంభీమ్ ఆవిష్కరించ నుండగా ముథోల్ మండలంలో గ్రామపంచయతీ భవనాన్ని ప్రారంభించనున్నారు. మండల కేంద్రమైన లోకేశ్వరంలో జరగనున్న కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ, సభ ప్రాంగణాన్ని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క రానున్న నేపథ్యంలో సభాస్థలి వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని స్థానిక ఎస్సై అశోక్‌కు సూచించారు. ఇందులో ఏఎస్సై దిగంబర్, నాయకులు జి. గంగాధర్, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, గంగాధర్‌లు ఉన్నారు.

ముథోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన లోకేశ్వరంలో జరగనున్న కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణకు వస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమావేశానికి అధికసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎక్కువ మొత్తంలో పాల్గొనాలని ఆయన అన్నారు.

నేడు బ్రహ్మన్‌గాంలో గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం

ముథోల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని బ్రహ్మన్‌గాం గ్రామానికి మంగళవారం మధ్యాహ్నం జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క రానున్నట్లు ఎంపీడీవో శివ కుమార్ తెలిపారు. బ్రహ్మన్‌గాం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 25 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవన ప్రారంబోత్సవ కార్యక్రమానికి మంత్రి కానున్నట్లు ఆయన తెలిపారు.

నేడు బాసరలో విద్యుత్ సమస్యల పరిష్కార శిబిరం

బాసర, మే26(ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్ర సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు డివిజన్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలో ప్రజలు, రైతులు, విద్యుత్ వినియోగులు విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఈ వేదికలో విన్నవించవచ్చని పేర్కొన్నారు. మండల, డివిజన్, జిల్లా అధికారులతో పాటు ఉన్నతస్థాయి వివిధ విభాగాలకు చెందిన అధికారులు, హాజరవుతారని చెప్పారు. వినియోగదారులు పేర్కొన్న సమస్య అప్పటికప్పుడు తేల్చి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్(జి), మే 26 (ఆంధ్రజ్యోతి) : బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీకాంత్‌ను మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు అజీమ్, పాసెన్ రాజేశ్వర్, ఉమా మహేశ్వర్, ప్రవీణ్, తదితరులున్నారు.

తల్లిదండ్రులతో సమావేశం


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

తానూర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాల గురించి తెలిపారు. అనుభవజ్ఞులయిన ఉపాధ్యాయులచే విధ్యాబోధన, సదుపాయాలను అందిస్తుందని పోషకులతో తెలియజేశారు. పోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఐకే రెడ్డిని విమర్శించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు

నిర్మల్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని విమర్శించే హక్కు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్ సోమవారం అన్నారు.